సాక్షి
నిజామాబాద్
బుధవారం । 21 । ఆగస్టు । 2024



ఒకే గది.. ఐదు తరగతులు

బాల్కొండలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఐదు తరగతులకు ఒకే గది ఉంది. వరండాలో విద్యార్థులు చదువుకుంటున్నారు.

-8లో ▸



అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హనుమంతు అధికారులను ఆదేశించారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
39.6 /22.1

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

అర్హులకు రుణమాఫీ చేయాలి



సుభాష్‌నగర్: సహకార సంఘాలు, వాణిజ్య బ్యాంకుల్లో రుణాలు పొందిన సుమారు 30 శాతం మంది రైతులకు సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాలేదని, అర్హులైన రైతుల రుణాలు మాఫీ అయ్యేలా చూడాలని ఐడీసీఎంఎస్ చైర్మన్ బదావత్ తారాచంద్ నాయక్ కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఐడీసీఎంఎస్ చైర్మన్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రుణమాఫీకి సంబంధించిన పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మండలస్థాయి వ్యవసాయ అధికారుల ద్వారా రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి, సంబంధిత శాఖల రాష్ట్ర అధికారులకు పంపించి, అర్హులకు రుణమాఫీ అయ్యేలా చూడాలని విన్నవించారు. ఆయన వెంట మాధవనగర్, గుండారం సొసైటీల చైర్మన్లు దాసరి నాగేశ్వర్‌రావు, దాసరి శ్రీధర్ తదితరులున్నారు.

డీఎస్‌వోగా అరవింద్‌రెడ్డి

సుభాష్‌నగర్: రాష్ట్ర పౌరసరఫరాలశాఖ అధికారులు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ల బదిలీలను మంగళవారం చేపట్టారు. జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిగా (డీఎస్‌వో) టి అరవింద్‌రెడ్డి (ఎఫ్ఏసీ) నియమితులయ్యారు. మంచిర్యాల జిల్లా ఏసీఎస్‌వోగా విధులు నిర్వర్తించిన ఆయన జిల్లాకు రానున్నారు. ఇక్కడ ఇన్‌చార్జి డీఎస్‌వోగా రెండున్నర నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన పద్మను హైదరాబాద్‌కు బదిలీ చేశారు. సివిల్ సప్లయిస్ డీఎంగా వైపీ రమేశ్‌ను కొనసాగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జిగా ఉన్న రమేశ్‌ను రెగ్యులర్ చేశారు. ఏఎంగా బాధ్యతలు నిర్వర్తించిన జగదీశ్‌కుమార్ యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ అయ్యారు.

34 మందిపై కేసు నమోదు

సిరికొండ: మండలంలోని జంగిలోడి తండాకు చెందిన 34 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ మంగళవారం తెలిపారు. సోమవారం అటవీ భూములను స్వాధీనం చేసుకోవడానికి వెళ్లిన సమయంలో తమ వాహనాలపై దాడి చేశారని అటవీ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు 23 మంది పురుషులు, 11 మంది స్త్రీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రాములు, రంగయ్య, అర్జున్, రమేశ్ అనే నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, మిగతా వారు పరారీలో ఉన్నారన్నారు.

27 నుంచి దివ్యాంగులకు పరికరాల పంపిణీ

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని దివ్యాంగులకు సహాయ పరికరాలను ఈ నెల 27 నుంచి 29వ తేదీవరకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి షేక్ రసూల్‌బీ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 27న ఆలూర్, ఆర్మూర్, నందిపేట్, జక్రాన్‌పల్లి, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, వేల్పూర్, భీమ్‌గల్, ఏర్గట్ల, మెండోరా, ముప్కాల్, బాల్కొండలో, 28న రెంజల్, ఎడపల్లి, సాలూర, బోధన్, మోస్రా, రుద్రూర్, వర్ని, చందూర్, కోటగిరి, 29న నవీపేట్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్‌రూరల్, మాక్లూర్, డిచ్‌పల్లి, సిరికొండ, ఇందల్‌వాయి, మోపాల్‌లో శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. 80శాతం శారీరక దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు, 40శాతం ఉంటే మూడు చక్రాల రిక్షా, వీల్ చైర్, చంక కర్రలు అందజేస్తామన్నారు. అలాగే బధిరులకు శ్రవణ యంత్రాలు(హియరింగ్ పాడ్స్), అంధులకు ప్రత్యేక మొబైల్స్, అరచేతి కర్ర, మానసిక దివ్యాంగులకు ప్రత్యేక కిట్‌ను ఇవ్వనున్నట్లు వివరించారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 14,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 3,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 522 క్యూసెక్కులు పోతోంది. మిషన్ భగీరథ తాగు నీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా, మంగళవారం సాయంత్రానికి 1081.90 (50.23 టీఎంసీలు) అడుగుల నీరునిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.



వరద నీటికి దారేదీ!

- పూలాంగ్ వాగు, నిజాంసాగర్ కాలువ, డ్రెయిన్లు, చెరువుల కబ్జాలు
- నిబంధనలు పాటించకుండా లేఅవుట్లు
- గట్టిగా వానొస్తే ఇందూరు నగరం అతలాకుతలం
- మరోవైపు నాలాలు ఆక్రమించి భారీగా నిర్మాణాలు.. పట్టించుకోని అధికారులు
- సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న మున్సిపల్ అధికారులు

అర్సపల్లిలోని రామర్తి చెరువును ఆక్రమించి నిర్మాణాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సోమవారం ఆగస్టు 19, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడు గంటల వరకు కురిసిన వర్షంతో నిజామాబాద్ నగరంలో జనజీవనం అతలాకుతలమైంది. ప్రధాన రహదారులన్నీ భారీగా వరద నీటితో నిండిపోయాయి. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఐదడుగుల లోతులో నీళ్లు నిలిచాయి. ఇతర రహదారుల్లోనూ భారీగా నీరు పారడంతో సుమారు మూడుగంటల పాటు ట్రాఫిక్ సమస్య అవస్థలపాలు చేసింది. వందమీటర్ల దూరం వెళ్లేందుకు 30 నిముషాల సమయం తీసుకుంది. వరదనీటి సమస్యను ఎదుర్కొన్న అనుభవాలు గతంలోనూ అనేకసార్లు కలిగాయి. అయినప్పటికీ అధికార యంత్రాంగం శాశ్వత పరిష్కార చర్యలు తీసుకునే విషయంలో ఒక్క అడుగూ ముందుకు వేయని పరిస్థితి. పైగా కీలకమైన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నవాళ్లకు, అక్రమ కట్టడాలకు బాజాప్తా ప్రోత్సాహం ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలకు నిదర్శనంగా వరద నీరు వచ్చినప్పుడు కళ్లకు కట్టినట్లు సమస్య కనిపిస్తోంది. వ్యవహారం ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో నగరం ట్రాఫిక్‌లో త్రిశంకుస్వర్గం మాదిరిగా తయారవుతుందని ప్రజలు అంటున్నారు. మరోవైపు వెంచర్లు వేస్తే పాటించాల్సిన నిబంధనల గురించి అధికారులు కాగితాల్లో మాత్రమే చూపుతున్నారు. ఎవరైనా క్షేత్ర స్థాయిలో పూర్తిగా ఉల్లంఘించినప్పటికీ తమకేం తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

పూలాంగ్ వద్ద ఆక్రమణతో పిల్లకాలువగా మారిన వాగు

SAKSHI FOCUS
సాక్షి ఫోకస్



■ నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు, సెట్‌బ్యాక్, ఫైర్ అనుమతులు లేకుండానే అత్యధిక భవనాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టారు. వీటి విషయంలో అధికార యంత్రాంగం తమకేం సంబంధంలేదన్నట్లు వ్యవహరిస్తోంది. పార్కింగ్ విషయంలో పోలీసు శాఖ వాహనదారులకు జరిమానాలు వేస్తుండగా.. ఆయా భవనాల పార్కింగ్, ఫైర్, సెల్లార్, సెట్ బ్యాక్ విషయమై ఆయా శాఖల మధ్య ఏనాడూ సమన్వయ సమావేశం జరిగిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.



ఎల్లమ్మగుట్టలో పిల్లకాలువగా మారిన పూలాంగ్ వాగు

■ బోధన్ రోడ్డులోని రామర్తి చెరువు విస్తీర్ణం 32 ఎకరాలు కాగా ప్రస్తుతం 6 ఎకరాల లోపు మాత్రమే మిగిలి ఉంది. ఈ విషయమై గత మార్చి నెలలో 'సాక్షి' కథనాలు రాయడంతో అధికారులు మూడురోజుల పాటు కూల్చివేతల ప్రక్రియ నిర్వహించారు. తరువాత మళ్లీ ఆక్రమణదారులు కట్టడాలు చేస్తుండడం గమనార్హం. నిజామాబాద్ నగరంలో వాగులు, కాలువలు, చెరువు లు, కుంటలు కబ్జాలు చేయడం ఒక ఎత్తైతే, నిబంధనలు ఉల్లంఘించి చేసిన నిర్మాణాల కారణంగా అంతా జిగ్‌జాగ్‌గా మారింది. ఇప్పటికైనా బెంగళూరు, హైదరాబాద్, ముంబాయి అనుభవాలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్ అవసరాల మేరకు నగర పరిస్థితిని చక్కదిద్దే ప్రక్రియ చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు. అవసరమైతే నిజామాబాద్ జిల్లాలోనూ 'హైడ్రా' మాదిరి వ్యవస్థను ఏర్పాటు చేసి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిజాంసాగర్ కాలువ సైతం..

మాలపల్లి, అహ్మద్‌పురా కాలనీ, నటరాజ్ థియేటర్ వెనుక నుంచి మిర్చి కాంపౌండ్ వైపు డి–54 కాలువను పూర్తిగా ఆక్రమించి ఇళ్లు, భవనాలు కట్టుకున్నారు. కాలువ ఆనవాళ్లేవీ లేకుండా పోయాయి. ఇతర ప్రాంతాల్లో కాలువలో పూడిక తీయలేని దుస్థితి నెలకొంది. మరోవైపు నగరంలోని కీలకమైన బొడ్డెమ్మ చెరువు వద్ద 28 ఎకరాల శిఖం భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేశారు.

■ చెరువులు, అటవీ భూములు ఆక్రమించి వేసిన వెంచర్లు నగరంలో అన్నివైపులా కనిపిస్తాయి. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, దేవాదాయ భూములు విచ్చలవిడిగా ఆక్రమించి ఇప్పటికే స్వాహా చేసిన ప్రబుద్ధులు బోధన్ రోడ్డులోని 11వ వార్డు పరిధిలోని నుజహత్ కాలనీ వద్ద నిజాంసాగర్ కెనాల్‌ను, 11, 12 వార్డుల పరిధిలోని స్లాటర్ హౌస్ వెనుక ప్రాంతంలో చెరువులోనే చదును చేసి వెంచర్లు వేశారు. ఇప్పుడు ఇందులో నీరు చేరింది. ఇక్కడ భూములను కొనుగోలు చేసిన పేదలు భవిష్యత్తులో ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉంది.

■ స్లాటర్ హౌస్ వెనుక ఉన్న చెరువును సైతం మింగేస్తున్నారు. ఈ చెరువు చుట్టూ గుట్టలు ఉన్నాయి. గుట్టలపై రక్షిత అటవీ భూమి ఉంది. కొందరు ఏకంగా చెరువులో 12 ఎకరాలు మింగేశారు. ఇలాంటి దీన్ని పూర్తిగా చదును చేసి ప్లాట్లు చేశారు.

పిల్లకాలువ మాదిరిగా పూలాంగ్ వాగు..



ప్రగతినగర్ ప్రాంతంలో పిల్లకాలువగా మారిన పూలాంగ్ వాగు

ఇందూరు నగరంలో మురుగునీటితో పాటు, వర్షపు నీరు సాఫీగా బయటకు వెళ్లిపోయేందుకు పూలాంగ్ వాగు ప్రధాన పాత్ర పోషిస్తూ వచ్చేది. ఇంతగా ఉపయోగపడుతున్న ఈ వాగును అక్రమార్కులు అడుగడుగునా కబ్జాలు చేశారు. దీంతో వాగు కాస్తా పిల్లకాలువ మాదిరిగా మారిపోతోంది. ప్రతిరోజూ ఈ పులాంగ్ వాగు ఆక్రమణలను చూస్తున్న అధికార యంత్రాంగం మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తోంది. గాయత్రినగర్, పద్మనగర్, ప్రగతినగర్, ఎల్లమ్మగుట్ట, కంఠేశ్వర్, గూపన్‌పల్లి వరకు వాగు కుంచించుకుపోయింది. కంఠేశ్వర్, గూపన్‌పల్లి ఏరియాల్లో కొందరు ప్రబుద్ధులు పులాంగ్‌లో వేలకొద్దీ ట్రక్కుల మట్టి నింపి వెంచర్లు వేసి ప్లాట్లు అమ్మేశారు. అధికారులు మాత్రం సినిమా చూసినట్లు చూస్తుండడం గమనార్హం.



స్లాటర్ హౌస్ వెనకాల చెరువును కబ్జా చేసి వేసిన రోడ్డు



గూపన్‌పల్లి వద్ద పూలాంగ్ వాగు ఆనుకొని ఉన్న ఇల్లు



బైపాస్ రోడ్డులో పూలాంగ్ వాగును ఆక్రమించి కట్టిన గోడ

స్కానింగ్ సేవలకు మంగళం

- రేడియాలజిస్ట్‌లు లేక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో ఇబ్బందులు
- ప్రైవేట్ సెంటర్లకు పరుగులు పెడుతున్న గర్భిణులు



మోర్తాడ్ ఆస్పత్రిలోని స్కానింగ్ యంత్రం

మోర్తాడ్(బాల్కొండ): గర్భిణులైన మోర్తాడ్‌కు చెందిన స్రవంతి, ఏర్గట్ల మండలం గుమ్మిర్యాలకు చెందిన లక్ష్మి స్కానింగ్ కోసం మోర్తాడ్ ఆస్పత్రికి రాగా, ఇక్కడ రేడియాలజిస్ట్ లేకపోవడంతో స్కానింగ్ చేయలేమని ఆర్మూర్‌లోని ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌కు వెళ్లాలని వైద్య సిబ్బంది సూచించారు. గత్యంతరం లేని పరిస్థితిలో ప్రైవేట్‌కు వెళ్లి డబ్బులు చెల్లించి స్కానింగ్ చేయించుకున్నారు. ఇది ఒక్క స్రవంతి, లక్ష్మికి ఎదురైన పరిస్థితి కాదు. ఎంతో మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన గర్భిణులు స్కానింగ్ కోసం డబ్బులు ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది. సామాజిక ఆస్పత్రులకు గత ప్రభుత్వం స్కానింగ్ యంత్రాలను సమకూర్చినప్పటికీ రేడియాలజిస్టులను నియమించకపోవడంతో స్కానింగ్ సేవలు కొనసాగడం లేదు. మోర్తాడ్, బాల్కొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, కోటగిరి, వర్ని, నవీపేట్ కమ్యూనిటీ ఆస్పత్రులతోపాటు బోధన్ ఏరియా, ఆర్మూర్‌లోని వంద పడకల, జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రులకు స్కానింగ్ యంత్రాలు మంజూరయ్యాయి. గైనకాలజిస్టులు, మత్తు వైద్యుల పోస్టులతోపాటు రేడియాలజిస్టు పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. స్కానింగ్ సేవలు జిల్లా జనరల్ ఆస్పత్రుల్లేనే అందుతున్నాయి. మహిళలు గర్భందాల్చిన నాటి నుంచి ప్రసవం వరకు మూడుసార్లు స్కానింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. స్కానింగ్ కోసం ఒక్కోసారి రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టి సారిస్తేనే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు గత ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేసింది. గర్భిణులకు పోషకాహారం అందించడంతోపాటు ప్రసవం అనంతరం కేసీఆర్ కిట్ అందజేశారు. లక్షలు వెచ్చించి స్కానింగ్ యంత్రాలు కొనుగోలు చేసినా రేడియాలజిస్ట్ పోస్టులను భర్తీ చేయకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్పందించి రేడియాలజిస్ట్‌లను నియమించి కమ్యూనిటీ ఆస్పత్రుల్లో స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పోస్టుల భర్తీతోనే పరిష్కారం

వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. త్వరలోనే వైద్యుల నియామకం జరగనుంది. రేడియాలజిస్ట్ పోస్టులు కూడా భర్తీ చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే స్కానింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– డాక్టర్ శివ శంకర్, జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారి

వణికిస్తున్న శునకాలు

- బోధన్ పట్టణంలో స్వైర విహారం
- ఆది, మంగళవారాల్లో పలువురికి కాటు
- కుక్కల బెడదను నివారించాలని స్థానికుల రాస్తారోకో
- అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదని ఆగ్రహం



రాస్తారోకో చేస్తున్న పట్టణ వాసులు



గాయపడిన గర్భిణీకి చికిత్స చేస్తున్న వైద్యుడు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో శునకాలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం రాత్రి ఓ వ్యక్తిపై కుక్కలు దాడి చేయగా, మంగళవారం ఏకంగా 11 మందిపై పిచ్చికుక్క దాడి చేసింది. బాధితుల్లో నిండు గర్భిణీతోపాటు నాలుగేళ్ల బాలుడు ఉన్నాడు. పిచ్చి కుక్కదాడితో పట్టణంలోని తట్టికోట్, ఉద్మార్ గల్లీ ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. బాధితులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుక్కల బెడదను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఆయా కాలనీల వాసులు ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు జునైద్ మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రతి వీధిలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నా బల్దియా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కుక్కల బెడదను నియంత్రించాలని బల్దియా అధికారులకు, పాలకవర్గానికి పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ వీరయ్య ఘటనా స్థలానికి చేరుకొని రాస్తారోకో చేస్తున్న వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రుణమాఫీ కోసం దరఖాస్తుల వెల్లువ



జక్రాన్‌పల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్

- రుణమాఫీ కోసం క్యూ కట్టిన రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): రుణమాఫీ వర్తించని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు మండలానికో నోడల్ అధికారిని నియమించిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం 10గంటల నుంచి నోడల్ అధికారులకు, మరోవైపు వ్యవసాయాధికారుల ఫోన్‌లకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మండల వ్యవసాయ కార్యాలయాలు, రైతు వేదికల వద్ద రైతులు క్యూ కట్టారు. రేషన్‌కార్డు లేని వారు కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డులు, పట్టా పాస్‌పుస్తకాలు అందజేశారు. అధికారులు కుటుంబ సభ్యుల వివరాలను నిర్ధారణ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అలాగే ఆధార్, లోన్ ఖాతాకు పేర్లలో తేడాలు ఉండడం, సొసైటీలు, బ్యాంకుల్లో వివరాలు తప్పుగా ఉండడంతో చాల మంది రైతులు దరఖాస్తులు చేశారు.

అధికారులను సంప్రదించి సందేహాలు, అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. అధికారులు దరఖాస్తులను పరిశీలించి ఉన్నతాధికారులకు పంపనున్నారు. ఒక్కో మండలంలో నూటికి పైగా దరఖాస్తులు అందినట్లు సమాచారం.

కొనసాగుతున్న జూడాల నిరసన



కలెక్టర్‌తో మాట్లాడుతున్న జూడాలు

నిజామాబాద్‌నాగారం: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసును నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట జూనియర్ డాక్టర్ల(జూడా) నిరసన కొనసాగుతోంది. ఏడో రోజైన మంగళవారం జీజీహెచ్ ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీహనుమంతు, సీపీ కల్మేశ్వర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. జీజీహెచ్‌లో భద్రతాసిబ్బంది సంఖ్యను పెంచాలని, మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా జూడా అధ్యక్షుడు డాక్టర్ జితిన్, కార్యదర్శి డాక్టర్ ఆశీష్, ఉపాధ్యక్షులు డాక్టర్ కార్తీక్, డాక్టర్ గ్రీష్మ, డాక్టర్ రాజేశ్, డాక్టర్ రఘునందన్, జూడాలు పాల్గొన్నారు.

పోచారంనకు కేబినెట్ హోదా!

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా నియామకం



బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న కాసుల బాల్‌రాజ్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో సీనియర్ నేత అయిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కేబినెట్ హోదా దక్కింది. వ్యవసాయ శాఖ సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఆయన.. స్థానికంగా మారిన రాజకీయాల కారణంగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఆయనకు కీలక పదవి వస్తుందని ప్రచారం జరిగింది. అనుకున్నట్లుగానే ప్రభుత్వం కేబినెట్ హోదాతో ప్రభుత్వ సలహాదారుగా నియమించడంతో ఆయన అనుచరుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు.

జిల్లానుంచి ఇద్దరు ప్రభుత్వ సలహాదారులు..

ఇప్పటికే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వ సలహాదారుగా కామారెడ్డికి చెందిన సీనియర్ నేత షబ్బీర్ అలీ కొనసాగుతున్నారు. ప్రభుత్వం తాజాగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని వ్యవసాయ శాఖ సలహాదారుగా నియమించింది. దీంతో జిల్లాలో ఇద్దరు నేతలకు కీలక పదవులు దక్కినట్టయ్యింది.

క్లుప్తంగా

గోల్డ్‌మెడల్ సాధించిన మదన్‌పల్లి విద్యార్థులు



మాక్లూర్: జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో మండలంలోని మదన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల గోల్డ్ మెడల్ సాధించారు. పాఠశాలలో హెచ్‌ఎం మంజుల, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఇందిర మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మెడల్ సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసన్న, లక్ష్మి, రాజకుమారి, ఆశారాణి, విజయలక్ష్మి, చక్రదర్, మునీరుద్దీన్, సురేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఒకే దరఖాస్తు

సుభాష్‌నగర్: నగరంలోని అర్సాపల్లి సబ్‌స్టేషన్‌లో డీ6 టౌన్–1 సబ్ డివిజన్ పరిధిలో ఉదయం 10.30 నుంచి ఒంటిగంట వరకు నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు ఒకే దరఖాస్తు వచ్చింది. సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్ ఎస్ రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ ఎల్ కిషన్ హాజరయ్యారు. ఎల్‌టీ లైన్ షిఫ్టింగ్ కోసం సతీశ్‌నగర్‌కు చెందిన వినియోగదారుడు దరఖాస్తు అందజేశారు. షిఫ్టింగ్ కోసం ఏఈ వద్ద దరఖాస్తు చేసుకోవాలని, ఎస్టిమేట్ మంజూరు ప్రకారం డీడీ చెల్లించిన తర్వాత షిఫ్టింగ్ పనులు చేస్తామని చైర్మన్ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఎం శ్రీనివాస్, టౌన్–1, 2, 3 ఏడీఈలు ఆర్ చంద్రశేఖర్, తోట రాజశేఖర్, పి వీరేశం, ఉద్యోగులు రవికిశోర్, నగేశ్, రమణ, పండరినాథ్, సబ్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికపై అవగాహన లేకపోవడం వల్లే దరఖాస్తులు రావడం లేదని, క్షేత్రస్థాయిలో అనేక రకాల సమస్యలున్నప్పటికీ పరిష్కార వేదిక దృష్టికి రాలేకపోతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. సోషల్ మీడియా, మైకులు, పత్రికల ద్వారా కొన్నిరోజులు ముందు నుంచే తెలియజేయాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకోండి

- సీపీకి వినతి



ఖలీల్‌వాడి: నగరంలోని భవాని ట్యాడీ కోఆపరేటివ్ సొసైటీ–3లో ఆధార్‌కార్డులు మార్ఫింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, రాంగోపాల్‌గౌడ్, స్వామిగౌడ్ సీపీ కల్మేశ్వర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. స్థానికులకే సొసైటీలో సభ్యత్వం కల్పించాలని ఇటీవల కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేస్తే కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. బాబాగౌడ్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

22న యోగాసన పోటీలు

నిజామాబాద్‌నాగారం: యోగ అసోసియేషన్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగాసన పోటీలను ఈ నెల 22న నగరంలోని ఉమామహేశ్వరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగాధర్ మంగళవారం పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8074982200, 8106420241 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భారం కానున్న ఎల్‌ఆర్‌ఎస్

■ మోర్తాడ్‌కు చెందిన లక్ష్మి 18 ఏళ్ల క్రితం కొందరు వ్యాపారులు విక్రయించిన ప్లాట్‌ను కొనుగోలు చేసింది. అప్పట్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్ చేయకుండానే వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించారు. 150 గజాల ఇంటి స్థలం కొనుగోలు చేసిన లక్ష్మి ఈ ప్లాట్ కోసం రూ.18 వేలను చెల్లించింది. అదనంగా మరో రూ.2,500లు ఖర్చు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంది.

■ చౌట్‌పల్లికి చెందిన గంగారాం బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లాడు. కమ్మర్‌పల్లిలో అతనికి ఇంటి స్థలం కొనుగోలు చేయాలని నిర్ణయించి బంధువుల ద్వారా వ్యాపారులకు రూ.20 వేలు చెల్లించి 120 గజాల స్థలాన్ని 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేశాడు. అప్పట్లో స్థలం రిజిస్ట్రేషన్ కోసం రూ.2,800 ఖర్చు చేశాడు.

ఇలా లక్ష్మి, గంగారాం తాము కొనుగోలు చేసిన ఇంటి స్థలాలకు హక్కుదారులమని చెప్పడానికి రిజిస్ట్రేషన్ కాగితాలు తమ వద్ద ఉంచుకున్నారు. ఇంటి అనుమతి కోసం ఎల్‌ఆర్‌ఎస్ కింద ప్రభుత్వానికి భారీ మొత్తంలో ఫైకం చెల్లించాలనే విషయం ఇటీవలే వీరికి తెలిసింది.

- పెరిగిన మార్కెట్ ఫీజు ప్రకారం క్రమబద్ధీకరణ
- గత ప్రభుత్వ హయాంలో భారీగా దరఖాస్తుల స్వీకరణ
- క్రమబద్ధీకరణ పేరిట ప్రభుత్వ ఖజానాకు సొమ్మును జమ చేయాల్సిన పరిస్థితి



మోర్తాడ్‌లో ప్లాట్లుగా మార్చిన వ్యవసాయ భూమి

మోర్తాడ్: ఎల్‌ఆర్‌ఎస్ అమలుతో లేఅవుట్ చేయని ఇంటి స్థలాలు, వెంచర్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. గత ప్రభుత్వం నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో అమలు చేయగా తాజా ప్రభుత్వం ఆదాయ మార్గాలను అన్వేషించి ఎల్‌ఆర్‌ఎస్(లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీం)ను గ్రామీణ ప్రాంతాలకు వర్తింప చేయాలని నిర్ణయించింది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని కోసం పంచాయతీ కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఇంజినీర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో ఓ కమిటీని వేసింది. వీరు ఎల్‌ఆర్‌ఎస్ కోసం గతంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వానికి చలాన్ జమ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్ చేయని వారికి ఇది భారంగా మారనుంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. ఒక్కో ప్లాట్‌కు మార్కెట్ ధర రూ.6వేల నుంచి రూ.20వేల వరకు క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. అంటే గతంలో కొనుగోలు చేసిన ప్లాట్‌కు చెల్లించిన ధరతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు సమానమయ్యే అవకాశం ఉంది.

అప్పట్లో వ్యతిరేకించి..

గత ప్రభుత్వం 2020లో లేఅవుట్ చేయకుండా విక్రయించిన ఇంటి స్థలాలను కొనుగోలు చేసిన వారు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఎల్‌ఆర్‌ఎస్ అమలు కేవలం నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలలోనే అమలు చేశారు. గత ప్రభుత్వ ఆదాయ మార్గాలను అన్వేషించి ఎల్‌ఆర్‌ఎస్‌ను గ్రామీణ ప్రాంతాలకు వర్తింప చేయాలని నిర్ణయించింది.

అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఎల్‌ఆర్‌ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకించింది. లేఅవుట్ లేని ఇంటి స్థలాలను కొనుగోలు చేసిన వారు ప్రభుత్వానికి దరఖాస్తు ఫీజు కింద రూ.వెయ్యి చొప్పున చలాన్ చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలోని 530 జీపీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 19వేల దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. మున్సిపల్‌లో అదనంగా మరో 7వేల వరకు దరఖాస్తులు అందినట్లు అంచనా. ప్రజలపై భారం మోపే విధంగా ఉన్న ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేసిన నాటి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానం అమలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్థల యజమానికి ఎంతో మేలు

ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేయడానికి గతంలోనే జీవోలు జారీ అయ్యాయి. వాటి ప్రకారం మార్కెట్ ధరను లెక్కించి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ఎంత అనేది తేల్చాల్సి ఉంటుంది. క్రమబద్ధీకరణ చేసుకోవడం వల్ల స్థల యజమానికి ఎంతో మేలు జరుగుతుంది.

– తరుణ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

ఒకే గది.. ఐదు తరగతులు



వరండాలో సాగుతున్న చదువులు



ఒకే గదితో ఉన్న పాఠశాల

- వరండాలో సాగుతున్న చదువులు
- బాల్కొండ ఉర్దూ మీడియం పాఠశాల దుస్థితి

బాల్కొండ: కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులను అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. ఇందుకు నిదర్శనం మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలనే. ఈ బడిలో 27 మంది విద్యార్థులు కనీస వసతులు లేకుండా విద్యను అభ్యసిస్తున్నారు. ఐదు తరగతుల విద్యార్థులు ఒకే గది, వరండాలో చదవాల్సిన దుస్థితి నెలకొంది. బాల్కొండ మండల కేంద్రంలో ఉర్దూ మీడియం పాఠశాల నిర్మించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ వసతులు కరువయ్యాయి. ఈ పాఠశాలలోని చిన్న గదిలో సుమారు 27 మంది విద్యార్థులు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. అంతేకాకుండా ఇదే గదిలో పాఠశాల కార్యాలయం, స్టోర్ రూం కూడా కొనసాగుతోంది. గతంలో పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో గతంలో ఉర్దూ మీడియం, ప్రాథమికోన్నత పాఠశాల మండల కేంద్రంలోని ఓ భవనంలో కొనసాగేది. ప్రభుత్వం ఉర్దూ మీడియం పాఠశాలకు భవనం కేటాయించడంతో రెండేళ్ల క్రితం పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చింది. కానీ ఒకే గది కేటాయించడంతో ఐదు తరగతుల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తరగతి గదుల కొరతతో తల్లితండ్రులు, గ్రామస్తులు తమ పిల్లలను పాఠశాలకు సరిగా పంపడం లేదు. ఉపాధ్యాయులు సైతం తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు అదనపు తరగతులు కేటాయించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఉర్దూ మీడియం పాఠశాలలో తరగతి గదుల కొరత గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతంలో వేరే పాఠశాలలో కలిపాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– రాజేశ్వర్, ఎంఈఓ, బాల్కొండ

పోటీ పరీక్షల్లో రాణించడం అభినందనీయం



నీట్ ర్యాంకు సాధించిన విద్యార్థులతో సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: పోలీసుల పిల్లలు ఉద్యోగ పోటీ పరీక్షలు, నీట్‌లో రాణించడం అభినందనీయమని సీపీ కల్మేశ్వర్ అన్నారు. నీట్ ర్యాంకులు, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పోలీసు సిబ్బంది పిల్లలను కమిషనరేట్ కార్యాలయంలో సీపీ మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24 గంటలపాటు విధినిర్వహణలో నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బందికి తమ కుటుంబంతో గడిపే సమయం ఉండదన్నారు. ఆ లోటును అధిగమిస్తూ పిల్లలు చదువుల్లో రాణించడం, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. నీట్‌లో ర్యాంకు సాధించిన ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మోహన్ కుమార్తె ఎ లాస్య, మూడో టౌన్ కానిస్టేబుల్ రఘువర్ధన్ కుమారుడు ఎస్ స్నేహల్, సీసీఎస్ కానిస్టేబుల్ కుమార్తె జె మౌనతో పాటు ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఎస్‌బీబీ హెడ్‌కానిస్టేబుల్‌గా మోజీరాం కుమార్తె ఆర్ కావేరిని సీపీ సన్మానించారు. అదనపు డీసీపీ బి కోటేశ్వరరావు, ఆరడ్మ్ రిజర్వ్ ఏసీపీ నాగయ్య, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి జలాల్ బుకారి దర్గా ఉర్సు



బోధన్‌టౌన్: పట్టణంలోని రెంజల్ బేస్ కాలనీలో ఉన్న సయ్యద్ షా జలాల్ బుకారి దర్గా ఉర్సు ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఉత్సవాలకు పట్టణంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. బుధవారం రాత్రి దర్గా ముత్తావలి సయ్యద్ మక్తేదార్ ఇంటి నుంచి చాదర్‌ను తీసుకొని ఊరేగింపుగా దర్గాకు వచ్చి అలకంకరణ చేస్తారు. 22న రాత్రి ఢిల్లీ బృందంచే కవాలీ, 23న సమాప్తంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉర్సు కమిటీ అధ్యక్షుడు ఖాజా షర్ఫొద్దీన్, ప్రతినిధులు ముషీర్ బాబా, యూనుస్ పటేల్, ముక్రమొద్దీన్ తెలిపారు.

చిక్లి, గుంజ్లి లిఫ్టు పనులు ప్రారంభం

మాక్లూర్: మండలంలోని చిక్లి, గుంజ్లి, కొత్తపల్లి, వల్లభాపూర్, పలు గ్రామాల రైతులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న గుంజ్లి లిఫ్టు పనులు ప్రారంభం కాబోతున్నాయి. ఇటీవల కాలంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఇరిగేషన్ ఏఈ, డీఈలతో కలిసి గుంజ్లి శివారులో చేపట్టే లిఫ్టు పంప్ హౌస్ స్థలాన్ని పరిశీలించారు. పనులు త్వరగా చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతలోనే మంగళవారం ఉదయం లిఫ్టుకు సంబంధించిన భారీ వాహనాల్లో పైపులు, ఇతర సామగ్రి రావడంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. అయితే లిఫ్టును మూడేళ్ల క్రితం గత ప్రభుత్వం మంజూరు చేసి మొదటి విడతగా రూ. 80 కోట్లు మంజూరు చేసింది. కానీ పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల ఎమ్మెల్యే లిఫ్ట్‌ను నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. నిధులు ఉన్నందున పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. తాజాగా ప్రభుత్వం రూ. 132 కోట్లు కేటాయించింది. దీంతో పనులు ప్రారంభించటానికి కాంట్రాక్టర్ ఏర్పాట్లు చేయడంతో స్థానిక రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

ఆర్మూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేపట్టాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. కనీసం 40శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ లబ్ధి చేకూరలేదని క్షేత్రస్థాయి నుంచి తమకు సమాచారం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరితో లక్షలాది మంది రైతులు ప్రతి రోజూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు సీఎం రేవంత్‌రెడ్డి రూ. రెండు లక్షల వరకు అందరికీ రుణమాఫీ అయ్యిందని చెబుతుంటే మంత్రులు మాత్రం ఇంకా పూర్తికాలేదని కార్యక్రమం కొనసాగుతోందని చెబుతుండటం అయోమయానికి గురి చేస్తోందన్నారు. రైతుల పక్షాన పోరాటంలో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 22న జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు రైతులతో కలిసి ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్షతగాత్రులను కాపాడబోయి..



రామాగౌడ్(ఫైల్)

దుబ్బాకరూరల్: కారు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో క్షతగాత్రులకు సాయం చేస్తున్న ఓ వ్యక్తిని మృత్యువు కబళించిన ఘటన దుబ్బాక రూరల్ మండలం చిట్టాపూర్ గ్రామ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బీబీపేటకు చెందిన రాజేందర్ తన కుటుంబీకులతో కలిసి కారులో సిద్దిపేట వైపు వెళ్తున్నాడు. అక్బర్‌పేట-భూంపల్లి పీఎస్ పరిధిలోని చిట్టాపూర్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి 10 గంటలకు వీరు ప్రయాణిస్తున్న వాహనం డివైడర్‌ను ఢీకొన్నది. అందులో ఉన్న అమూల్య, సిరి చందనకు గాయాలయ్యాయి. చిట్టాపూర్‌కు చెందిన ఇర్కోటి రామాగౌడ్(64) ఇంటి ఎదుటే ఈ ఘటన చోటు చేసుకోవడంతో వెంటనే క్షతగాత్రులను కారు నుంచి బయటకు దించుతున్న ఘటనలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో రామాగౌడ్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అంతేకాకుండా ఆయన పక్కనే ఉన్న మనవాడికి సైతం గాయాలయ్యాయి. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు..



పీర్‌సింగ్(ఫైల్)

నాగిరెడ్డిపేట: చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందిన ఘటన మండలంలోని తాండూర్ శివారులో మంగళ వారం చోటుచేసుకుంది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బంజార తండాకు చెందిన దేగావత్ పీర్‌సింగ్(39) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. అప్పుడప్పుడు చేపల వేటకు వెళ్తుండేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి చేపలవేటకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు గ్రామ శివారులోని నాగనయ్య చెరువు వద్ద పరిశీలించగా బైక్, చెప్పులు లభించాయి. గోపాల్‌పేటకు చెందిన ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కోటగిరిలో మరొకరు..

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని దామర చెరువులో చేపల వేటకు వెళ్లిన తోకల రాములు(40) ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకోవడంతో చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రాములు మంగళవారం చేపల వేటకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటికి రాలేదు. కుటుంబీకులు చెరువులో ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య తోకల మల్కవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మట్టి పెళ్లలు పడి వృద్ధురాలు..

రుద్రూర్: మట్టి పెళ్లలు పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొర్లం సాయవ్వ(82) కొడుకు కోడలితో కలిసి మండల కేంద్రంలోని ఓ మట్టి ఇంట్లో ఉంటోంది. కుటుంబీకులు పనుల నిమిత్తం ఇతర గ్రామానికి వెళ్లగా సాయవ్వ ఇంట్లో ఉంటుంది. మంగళవారం అకస్మాతుగా వృద్ధురాలి తలపై మట్టి పెళ్లలు పడి గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పొందుతూ మృతి చెందింది. వీఆర్‌ఏ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపిమేస్త్రీ ..



కొండయ్య(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లాకు చెందిన తాపిమేస్త్రీ చిన్నగారి కొండయ్య(38) మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. ఎస్సై మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి నిమిత్తం మూడు నెలలు గా గన్నారంలో ఉంటున్న కొండయ్య ఇందల్వాయి నుంచి గన్నారం వైపు రహదారి పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కొండయ్యకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి తమ్ముడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జ్వరంతో విద్యార్థి ..



వీరేందర్(ఫైల్)

లింగంపేట: తీవ్ర జ్వరంతో ఓ బీటెక్ విద్యార్థి మంగళవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బాయంపల్లి కిషన్‌నాయక్ తండాకు చెందిన సబావత్ చౌహాన్ వీరేందర్(22) ఖమ్మం జిల్లాలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన అతను ఆదివా రం తీవ్ర జ్వరానికి గురయ్యాడు. గమనించిన కుటుంబీకులు సోమవారం కామారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. కుటుంబీకులు అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మంగళవారం ఉదయం మృతి చెందాడు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఆత్మహత్యకు యత్నం

నవీపేట: మండలంలోని యంచ శివారులోని గోదావరి నది బ్రిడ్జిపై ఆత్మహత్యకు యత్నించిన తల్లి, కుమార్తె, కుమారుడిని యంచ గ్రామస్తులు కాపాడారు. జిల్లా కేంద్రానికి చెందిన మహిళ తన కుమార్తె, కూతురు, కుమారుడితో కలిసి బాసర వైపు బ్రిడ్జిపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా గమనించిన యంచ గ్రామస్తులు వివరాలు ఆరా తీయగా కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో వారు బాసర పోలీసులకు సమాచారమివ్వగా వారు అక్కడికి చేరుకున్నారు. భర్తను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి నిజామాబాద్‌కు పంపించారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

మాక్లూర్: మండలంలోని మాలపల్లి శివారులో ఒకరు అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మాలపల్లికి చెందిన నాగుర్ల శ్రీకాంత్(34)కు రెండేళ్ల క్రితం మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన శ్రీలతతో వివాహమైంది. వివాహమైన నాటి నుంచి వీరి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఆరు నెలల క్రితం భర్తతో గొడవ జరగడంతో శ్రీలత పుట్టింటికి వెళ్లింది. తన భార్యను ఇంటికి తీసుకెళ్దామని ఈ నెల 18న మాక్లూర్‌కు వెళ్లాడు. శ్రీలతను కాపురానికి రావాల నికోరగా రాఖీ పండుగ తర్వాత వస్తానని చెప్పడంతో అతను వెనుదిరిగాడు. కాగా సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని నీటిగుంతలో పడి మృతదేహమై కనిపించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

మృతుడి తండ్రి భూమన్న ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహనాల పట్టివేత

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని అర్సపల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఆరో టౌన్ ఎస్సై మొగులయ్య మంగళవారం తెలిపారు. తనిఖీల్లో రాంగ్ రూట్, మొబైల్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేసిన 30 వాహనాలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

నకిలీ మందుల తయారీలో ఒకరి అరెస్ట్

నిజామాబాద్‌నాగారం: నకిలీ మందులు తయారు చేసి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ నర్సయ్య తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రొద్దుటూరుకు చెందిన లక్ష్మీనర్సయ్య అనే వ్యక్తి కామారెడ్డిలో స్థిరపడ్డాడు. నాటి నుంచి నకిలీ మందులు తయారు చేస్తూ విక్రయిస్తుండడంతో 2014లో పోలీసు కేసు నమోదు కాగా విచారణ కొనసాగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు వ్యక్తిని అరెస్టు చేసి కామారెడ్డి కోర్టులో హాజరు పర్చినట్లు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిజామాబాద్ అర్బన్ డీఐ శ్రీకాంత్, కామరెడ్డి డీఐ రాజారెడ్డి పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి



దాడిలో గాయపడ్డ మహేశ్

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చౌరస్తా వద్ద మద్యం మత్తులో ఇద్దరు గొడవ పడగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పెర్కిట్‌కు చెందిన బండి మహేశ్, ఆకుల ప్రశాంత్ ఒకే దగ్గర పెర్కిట్ కూరగాయల మార్కెట్‌లో కూలీ పనిచేస్తుంటారు. మంగళవారం పనులు ముగించుకున్న ఇద్దరు మద్యం సేవించి గొడవ పడ్డారు. మద్యం మత్తులో ప్రశాంత్ మహేశ్‌పై పదునైన ఆయుధంతో చాతిపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. మహేశ్ సోదరి ఇద్దరిని ఆపేందుకు ప్రయత్నించగా ఆమెకు గాయాలయ్యాయి. దాడిచేసిన ప్రశాంత్ అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన మహేశ్‌ను స్థానికులు 108 అంబులెన్స్‌లో ర్మూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్‌హెచ్‌వో రవికుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రశాంత్‌పై మహేష్ సోదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవీపేట: మండల కేంద్రంలోని బాలకోటిరెడ్డి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై వినయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మూడు రోజుల క్రితం బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు వెళ్లాడు.మంగళవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి తాళాలుపగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో బీరువాలో ఉన్న రూ. 30 వేల నగదుతో పాటు రెండు తులాల బంగారు ఆభరణాలు, వెండిపాత్రలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నా రు.

వృద్ధుడి అదృశ్యం



సుదర్శన్

ఖలీల్‌వాడి: నగరంలోని కోట గల్లీకి చెందిన దోమల సుదర్శన్ అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

రాజంపేట: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సాలెపల్లి తండాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లకావత్ మల్లేశ్(27)కు భార్యాభర్తల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన మల్లేశ్ సోమవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి లకావత్ బుట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరు..

వర్ని(మోస్రా): మద్యానికి బా నిసై ఒకరు ఆత్మహత్య చేసుకు న్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణమూర్తి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన హంగిర్గా మహేశ్(40) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయాలని మందలించడంతో కుటుంబీకులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చే సుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపేర్కొన్నారు.